క్లుప్తంగా

విశ్వబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక పెద్దబండ వీధిలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడిగా గురుప్రసాదాచారి, అధ్యక్షుడిగా సూర్యప్రకాష్ ఆచారి, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్ ఆచారి, ప్రధాన కార్యదర్శిగా సుబ్బాచారి, కోశాధికారిగా వీరభద్రాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు సూర్యప్రకాష్ ఆచారి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విశ్వబ్రాహ్మణ విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కాళికాంబాదేవస్థానం కమిటీలో విశ్వబ్రాహ్మణులకు స్థానం కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు. అదే విధంగా వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి పాటు పడతామని చెప్పారు.

ఆలయ భూములు పరిరక్షిస్తాం



ఆలయ అధికారులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనంది దేవాలయ భూముల అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించి ఆలయ భూములను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రథమనంది ఆలయ భూముల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రస్తా నిర్మాణం చేసే ప్రయత్నం చేశారన్నారు. జిల్లాలో దేవాలయ భూముల జోలికి వస్తే సహించమని, న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలముని, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందినప్పుడే గుర్తింపు



ఎస్‌ఐ పదవీ విరమణ సభలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

దొర్నిపాడు: విధుల నిర్వహణలో ప్రజల మన్ననలు పొందినప్పుడే గుర్తింపు ఉంటుందని డీఎస్పీ ప్రమోద్ అన్నారు. సోమవారం మండల ఎస్‌ఐ సత్యనారాయణ పదవీ విరమణ సందర్భంగా ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎస్‌ఐ సత్యనారాయణ పోలీసు వృత్తిలో 43 ఏళ్ల సేవలు అందించడం గర్వించదగ్గ విషయం అన్నారు. అనంతరం ఎస్‌ఐ దంపతులను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు మురళీధర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, దస్తగిరి బాబు, ఎంపీడీఓ సావిత్రి, అడ్వకేట్ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళా వేదికపై హైదరాబాద్‌కు చెందిన విశ్వ ఆంజనేయ భజన మండలి వారు నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణపతి ప్రార్థన, లింగాష్టకం, శ్రీశైలం శివమయం, మహేశ్వర పాపవినాశ, శివశివ శంకరా, శంభో హరహర, కైలాసవాసుని, భ్రమరాంబామాతకు జయ మంగళం తదితర భక్తి గీతాలు, భజన కీర్తనలను లక్ష్మణ్, అమర్‌నాథ్, అశోక్, గోవిందు, అంజనేయులు, నరసింహాచారి, నవీన్‌కుమార్, సత్యనారాయణ తదితరులు ఆలపించారు. తబలా సహకారం యాదగిరి అందించారు.

మహానందిలో కుండపోత



మహానంది: మండల పరిధిలో ఆదివారం రాత్రి గాలి బీభత్సంగా వీచింది. గాలి అనంతరం మహానంది ఆలయ పరిసరాలతో పాటు సమీప గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. క్షేత్రంలోని మాడవీధుల వెంట గాలి సమయంలో దుమ్ము, ధూళి లేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం భారీగా వర్షం కురవడంతో తడవకుండా ఉండేందుకు పరుగులు తీశారు. వర్షానికి ముందు మహానంది క్షేత్ర పరిసరాల్లోని ఆకాశంలో మబ్బులు కమ్ముకున్న దృశ్యం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసింది.

కాడెద్దులు కనుమరుగు!

- ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతుల ఆసక్తి
- ఎద్దుల స్థానంలో ట్రాక్టర్లు, యంత్రపరికరాలతో పనులు
- ఖర్చు, సమయం ఆదా అవుతుండటంతో వాటివైపు మొగ్గు
- ఆదరణ కోల్పోతున్న ఎడ్లు, బండ్లు

పొలం దున్నాలన్నా..విత్తు విత్తాలన్నా.. పండించిన పంట ఇంటికి చేర్చాలన్నా కాడెద్దులు కావాల్సిందే. వ్యవసాయంలో వాటి పాత్ర చాలా కీలకం. అయితే, ఇదంతా గతం. ఇప్పుడు వాటి స్థానంలో ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఎద్దులతో ఒక రోజు చేసే పని యంత్రాలతో రెండు, మూడు గంటల్లో జరిగిపోతోంది. దీంతో విత్తు మొదలు పంట కోత వరకు వాటినే వినియోగిస్తున్నారు. ఇది కొంత ఖర్చుతో కూడుకున్నదే అయినా సమయం ఆదా అవుతుండటంతో అధిక మంది రైతులు యంత్రాలవైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఒకప్పుడు రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచిన ఎడ్లు, బండ్లు నేడు క్రమంగా కనుమరుగవుతున్నాయి.

గోస్పాడు: వ్యవసాయంలో ఎద్దులతో రైతులకు విడదీయ రాని బంధం. దీంతో ఇదివరకు గ్రామాల్లో రెండు, మూడెకరాలు ఉన్న ప్రతి రైతుకు కనీసం ఒక జత కాడెద్దులు ఉండేవి. ఎద్దులు లేని రైతులు..కాడెద్దులు, నాగలి కట్టే మనిషికి పనిని బట్టి రోజుకు సుమారు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు వరకు ఇచ్చి వ్యవసాయం చేసుకునేవారు. ఇలా గతంలో ఎద్దులకు విపరీతమైన డిమాండ్ ఉండేది. రానురాను దుక్కి దున్నడం నుంచి పంట కోత కోసి ఇంటికి చేర్చే వరకు ప్రతి పనీ ట్రాక్టర్‌తో జరిగిపోతుండడంతో ఎద్దులకు చాలా వరకు డిమాండ్ తగ్గింది. ప్రస్తుత పరిస్థితుల్లో కాడెద్దుల పోషణ భారంగా మారింది. దీనికి తోడు కాడెద్దులు కూడా మరీ ఖరీదైపోతున్నాయి. సైజ్‌ను బట్టి రెండు ఎడ్లు లక్షరూపాయల నుంచి లక్షన్నరకు పైగా పలుకుతున్నాయి. అంత పెట్టుబడి పెట్టి కాడెద్దులను తీసుకొచ్చి వాటిని పోషించడం తలకు మించిన భారమవుతోంది. ఎద్దులకు మేతగా ఉపయోగపడే ఎండు గడ్డి సైతం ఒక లోడు సుమారు రూ.15నుంచి రూ.20 వేల వరకు పలుకుతోంది. ఇక దాణా, పచ్చిగడ్డి, సంరక్షణ ఇలా ప్రతీది రైతుకు భారమవు తోంది. దీంతో రైతులు ఉన్న ఎద్దులను అమ్మేసి యంత్రాల వైపు మొగ్గు చూపాల్సి వస్తోంది. ఒకప్పుడు నంద్యాల,గోస్పాడు మండలాల్లోని కల్లాల్లో కాడెద్దులు, పశువులు కనిపించేవి. ఇప్పుడు యంత్రాల రాకతో వాటి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. ఆయా మండలాల్లో ప్రస్తుతం 420 కాడెద్దులు ఉన్నాయి. ఇందులోనూ 40 శాతం మాత్రమే వ్యవసాయ పనులకు ఉపయోగపడనున్నట్లు సంబంధిత పశువైద్యాధికారులు చెబుతున్నారు.



గోస్పాడు సమీపంలో ఎద్దులతో పొలం చదును చేస్తున్న రైతు

యాంత్రీకరణ దిశగా

ఆధునిక యాంత్రీకరణ పుణ్యమా అని వ్యవసాయ రంగంలో దుక్కి పశువుల వినియోగం తగ్గిపోయింది. పొలం పనుల్లో యంత్రాల వినియోగం బాగా పెరిగింది. పశువులను దుక్కిదున్ని విత్తనాలు వేసుకోవడం, దమ్ము చేసి నాట్లు వేసే పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. దుక్కి నుంచి పంటను ఇంటికి చేర్చే వరకు అన్ని స్థాయిల్లో యంత్రాలు అందుబాటులో ఉండటంతో పశువులను పెంచుకోవడం దండగా అనే ఆలోచన రైతుల్లో పెరిగిపోయింది. ఇదిలా ఉండగా పశుపోషణ కూడా వారికి భారంగా మారింది. పొలా ల పనులు ప్రారంభమయితే ఇళ్ల వద్ద వాటిని చూసుకోవాలంటే కష్టమవుతుంది. ఎవరినైనా నియమించాలంటే కూలి ఎక్కువ అడుగుతారు. ఇదంతా ఒక ఎత్తైతే ఎకర పొలం పశువులతో దున్నాలంటే రైతుకు గంటలకొద్ది సమయం పడుతుంది. అదే పొలాన్ని ట్రాక్టర్‌తో గంటలో పూర్తి చేయవచ్చు. దీంతో చాలా మంది సొంతంగా ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలను సమకూర్చుకుంటుండగా, ఆర్థిక స్థోమత లేని వారు అద్దెకు తెచ్చుకొని పనులు పూర్తి చేసుకుంటున్నారు.



ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న దృశ్యం

అప్పటి పరిస్థితి లేదు



మాకు పది ఎకరాల పొలం ఉంది. 15కు పైగా పాడి పశువులతో పాటు రెండు జతల ఎద్దులు ఉండేవి. నాడు తక్కువ వేతనానికే కూలీలు దొరికేవారు. దీంతో ఎద్దులతో దుక్కిదున్నడం, విత్తనం వేయడం వంటి పనులన్నీ చేసేవాళ్లం. అయితే, ఇప్పుడు కూలీలు దొరకడం లేదు. దీనికితోడు పశువుల పోషణ ఖర్చు పెరిగింది. అందుకే ట్రాక్టర్‌ను తెచ్చుకొని వ్యవసాయ పనులు చేసుకోవాల్సి వస్తుంది. పనులు కొంత మేరకు సులభంగా, అనుకున్న సమయానికి పూర్తి చేసుకునేందుకు యంత్రాలు ఉపయోగపడుతున్నాయి.

– గోపాల్‌రెడ్డి, రైతు, సాంబవరం

పశువుల పెంపకం తగ్గింది



గతంలో ఏ ఇంట చూసినా పశువులు కనిపించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేవలం పాడి అవసరం కోసమే పశువులను పెంచుతున్నారు. ఎద్దులతో పొలాల్లో పని చేయాలంటే ఆలస్యం అవుతుండటంతో పాటు వాటి పోషణ భారమవుతుండటం, పెట్టుబడికి తగ్గ ఆదాయం లేక వాటిపై రైతులు ఆసక్తి చూపటం లేదు. ఇదే సమయంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక యంత్రాలతో పొలం పనులు త్వరితగతిన సాగుతుండటంతో కూలీల ఖర్చుతో పాటు సమయం ఆదా అయి శ్రమ తగ్గుతుందని రైతులు భావిస్తున్నారు.

–అభిలాష్‌రెడ్డి, పశువైద్యాధికారి, యాళ్లూరు

దూదేకుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పదవ తరగతి పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన దూదేకుల విద్యార్థులకు ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్ నందు నగదుతో పాటు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబన్ మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణత భవిష్యత్తు విజయానికి తొలి మెట్టు లాంటిదని అన్నారు. దూదేకుల అభివృద్ధికి తమవంతు సాయంగా కృషి చేస్తామన్నారు. అనంతరం 105 మంది విద్యార్థులకు నగదుతో పాటు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు ఫయాజ్, పీర్ మహమ్మద్, షేక్ సలీం, పర్ల దస్తగిరి, మస్తానమ్మ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆదివారం జాతీయ గణాంక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నాగజ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో గణాంకాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పారు. సమాజంలో ప్రతి మార్పుకు గణాంకాలే కారణమన్నారు. అభివృద్ధి ప్రణాళిక, సంక్షేమ కార్యక్రమాలు, వనరుల వినియోగం లాంటి కార్యక్రమాలకు గణాంకాలే ముఖ్యమన్నారు. కార్యాలయ పాలన అధికారి శ్రీనివాసులు, మద్దూరు నాగరాజు, పాల్, అరుణాదేవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం..



తమ పిల్లలతో కలిసి దీక్ష చేస్తున్న కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ కార్మికులు తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఏనిమిదో రోజు ఆదివారం తమ పిల్లలతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. సీఐటీయూ నాయకులు తోటమద్దులు, గౌస్, లక్ష్మణ్ తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు విషయంలో కూటమి ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేస్తామని మేనిఫెస్టోలో కూటమి నాయకులు ప్రకటించి ఇప్పుడు నోరు మెదపడం లేదన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతాయని హెచ్చరించారు. చంద్రబాబు తాతాయ్య.. లోకేష్ అంకుల్.. మా తల్లిదండ్రుల జీవితాల్లో వెలుగులు నింపాలని కార్మికుల పిల్లలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులతో పాటు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దుర్గా, భాస్కరాచారి, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులతో రోటరీ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): రోటరీ క్లబ్ సభ్యులు సమాజ సేవలో ముందుండాలని ఆ క్లబ్ ఎలక్టైడ్ గవర్నర్ త్రివిక్రమ్ జోషి పేర్కొన్నారు.. ఆదివారం నంద్యాల పట్టణంలోని రోటరీ భవన్‌లో జరిగిన మిడ్ టౌన్ రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మానవత్వం, పరోపకారం, సహకార గుణంతో సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రోటరీ క్లబ్ మాజీ గవర్నర్‌లు రామలింగారెడ్డి, శ్రీరామమూర్తి, చిన్నపరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ హరీష్ బాబు తదితరులు క్లబ్ సేవా కార్యక్రమాలు, వాటి ఆవశ్యకతపై వివరాలు అందించారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎంపికైన కేశవమూర్తి, వెంకటేశ్వర్లుతో త్రివిక్రమ్ జోషి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మిడ్ టౌన్ క్లబ్ మాజీ అధ్యక్షులు మురళీకృష్ణ, డీవీ సుబ్బయ్య, చింతల మోహన రావు , నెరవాటి రవికుమార్, గాంధీ, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం... రైతులకు శాపం



రూపనగుడి- మాయలూరు గ్రామాల మధ్య పొలంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఉయ్యాలవాడ : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ రంగానికి త్రీఫేస్ కరెంట్ సరఫరా చేస్తూ ఉన్నారు. అలాగే ఆ గ్రామాల్లో ఉన్న గృహ వినియోగదారులకు కూడా త్రీఫేస్ కరెంట్ ఇవ్వాలన్న లక్ష్యంతో నూతన విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేపట్టారు. సుమారు ఆరు నెలల క్రితం పనులు ప్రారంభించారు. నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టరు పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదు. దీంతో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ల స్తంభాలు కొద్ది రోజులకే నేలవాలి కింద పడిపోతున్నాయి. ఈ విషయాన్ని నెల 27వ తేదీన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కూడా ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. సమావేశానికి హాజరైన విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ బాషా మాత్రం పనులు తమకు సంబందం లేదని, కాంట్రాక్టరే దానికి కారణమని పేర్కొన్నారు. ఏదిఏమైనా పొలాల్లో కింద పడిన స్తంభాలను సరి చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

52 క్వింటాళ్లు మినీ కిట్లు మంజూరు

ఉయ్యాలవాడ : రైతులకు ఉచితంగా విత్తనాలు అందజేసేందుకు ప్రభుత్వం మండలానికి 52 మినీ కిట్లు విత్తనాలు మంజూరు చేసిందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కందులు ఎల్లార్జీ–52 రకం 20 క్వింటాళ్లు, మినుములు వీఎస్ 8 రకం 32 క్వింటాళ్లు మంజూరయినట్లు వెల్లడించారు. సన్న, చిన్నకారు రైతులకు నాలుగు కేజీల చొప్పున అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమకు అందుబాటులో వున్న రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దేవర ఉత్సవాలు పూర్తి కావడంతో వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండి వంటలు మొక్కుగా చెల్లించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అమ్మవారికి సారె సమర్పణ



మోకాళ్లపై గండాదీపాన్ని తీసుకొని వస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ మాతకు ఆషాఢ మాసోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సారె తీసుకొచ్చి సమర్పిస్తున్నారు. ఆదివారం ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. తర్వాత అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారి ప్రతిమను, గండా దీపాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ మోకాళ్లపై ప్రదక్షిణలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు మహామంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల పదో తరగతి, ఇంటర్మీడియట్, నీట్, జేఈఈ, మెయిన్స్, ఐఐటీ పోటీ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులకు నూనెపల్లి ఆర్యవైశ్య యువజన సంఘం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేసింది. ఆదివారం స్థానిక అమ్మవారిశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ సహదేవుడు విద్యార్థులకు మోటివేషన్ క్లాసు ఇచ్చారు. అనంతరం అధ్యక్షుడు సుదర్శన్‌శెట్టి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రజనీకాంత్, రాజేశ్వరి, సుబ్రమణ్యం, మారం శేషయ్య, నారాయణ, సుబ్బారావు, కొత్త సుబ్బయ్య, కాలవ నారాయణ, రఘువీర్ కుమార్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపురంలో కార్డెన్ సెర్చ్

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో ఆదివారం ఆత్మకూరు సీఐ రాము ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఆయుధాలు నిల్వ ఉంచుకున్న, ప్రధానంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా నేరమన్నారు. సారాను తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని అనుమానితుల గృహాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో 21 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. అలాగే డివిజన్‌లో ధ్రువపత్రాలు లేని 40 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆత్మకూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది ఆలయ తనిఖీ అధికారిగా డీసీ

- రేపు క్షేత్రానికి రానున్న అధికారి

మహానంది: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన దేవాలయాలతో పాటు డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ హోదా కలిగిన ఆలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, జరుగుతున్న అభివృద్ధి పనులపై దేవదాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి దేవాలయానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు ఆ శాఖ ప్రధాన కార్యాలయ వర్గాలు తెలిపాయి. అందులో భాగంగా మహానంది ఆలయానికి ఉమ్మడి జిల్లాల డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్‌ను నియమించినట్లు తెలిసింది. దీంతో ఆయన మంగళవారం మహానంది ఆలయానికి వస్తున్నట్లు సమాచారం. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆర్జిత సేవలు, వసతిగృహాల సౌకర్యం, అన్నప్రసాద వితరణ, షాపుల వివరాలు..తదితర వాటిపై తనిఖీ చేయనున్నారని తెలిసింది. ఇప్పటికే అప్రమత్తమైన అధికారులు ఆలయ ప్రాంగణంలో టెండరుదారులు భక్తులకు అందించే వస్తువుల ధరల వివరాలు, పాదరక్షలు, సెల్‌ఫోన్ లాకర్ల రుసుములపై ఎప్పటికప్పుడు మైకుల్లో అనౌన్స్ చేయిస్తున్నారు.

మహానందిలో భక్తుల సందడి



చిన్న కోనేరులో భక్తుల కోలాహలం

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉచిత, శీఘ్రదర్శనం, అభిషేకం, క్షీరాభిషేకం, మహదాశీర్వచనం ఆర్జిత సేవాటికెట్లతో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు.